ఇసుక కొరతతో ఉపాధి కరువు

- ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణ కార్మిక కుటుంబాలకు పస్తులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఇసుక కొరత కారణంగా ఏలూరు నగరంలో నిలిచిపోయిన భవన నిర్మాణం

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత పేదలను కన్నీటి పాలు చేస్తోంది. నాలుగు నెలలుగా పనులు లేక ఏలూరు నగరంతో పాటు కొమడవోలు, చొదిమెళ్ల, వెంకటాపురం, తంగెళ్లమూడి పోణంగి, సత్రంపాడు, శనివారపుపేటతో పాటు చాటపర్రు, మాదేపల్లి పరిసర గ్రామాల్లో వందలాది భవన కార్మికులు అల్లాడుతున్నారు. తాపీ, వడ్రంగి, సీలింగ్, టైల్స్, పెయింటింగ్ ఇలా నిర్మాణ రంగంలో పని లేదంటూ కార్మికులు గగ్గోల పెడుతున్నారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుకు కనీసం రూ.400 నుంచి రూ.500 రోజువారీ చీటీలు కట్టలేక పోవడంతో వడ్డీ వ్యాపారులు ఇంటికి వచ్చి కూర్చుంటారని వాపోతున్నారు.

ఇసుక కొరతే కారణం

కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిర్మాణ రంగం కుదేలైంది. ఇందుకు ఇసుక కొరతే కారణం. ఇసుక సరఫరాపై సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడ్డాయి. నిర్మాణ రంగానికి కావాల్సినంత ఇసుకను ప్రభుత్వం సరఫరా చేయడంలో విఫలమైంది. నిర్మాణ రంగాన్ని నిస్తేజంగా మార్చేసింది. ఈ ప్రభావం రెక్కాడితే గాని డొక్కాడని పేదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ రంగంపై ఆధారపడ్డ అనేక మంది పేదలు ఆకలితో అలమటిస్తున్నారు.

బ్లాక్ మార్కెటింగ్ ఇసుక బంగారమే

నేడు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుంటే 20 టన్నుల లారీకి రూ.21 వేలు ఖర్చు అవుతోంది. అదీ కూడా రోజుకు ఒకటి లేదా రెండు బుక్కవుతున్నట్టు భవన యజమానులు చెబుతున్నారు. బ్లాక్ మార్కెట్‌లో అయితే టిప్పర్లు ద్వారా టన్ను రూ.1200 అమ్ముతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో టన్ను ఇసుక రూ.600 నుంచి రూ.650 వరకు రేటు పలికింది. సుమారు 20 టన్నుల ఇసుక ఏలూరుకు చేరాలంటే సుమారు రూ.13 వేలు నుంచి రూ.14 వేలు ఖర్చయ్యేది. ఎంత ఇసుక కావాలంటే అంత ఇసుక 24 గంటల వ్యవధిలో ఇంటికి చేరేది. ఈ కారణంగా భవన నిర్మాణ రంగం ఎలాంటి ఒడిదిడుకులు లేకుండా సాఫీగా సాగింది. కూలీలకు చేతినిండా పని దొరికింది. నేడాపరిస్థితి లేదని కార్మికులు, యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ రంగం కుదేలు



నిర్మాణ రంగం కుదేలు కావడానికి ప్రధాన కారణం ఇసుక కొరత. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం కానరావడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ కావడం లేదు. బ్లాక్ మార్కెట్‌లో టన్నుకు రూ.1200 చెల్లిస్తే గంటల వ్యవధిలోనే ఇంటికి చేరిపోతోంది. టన్నుకు రూ.600 పెరగడం వల్ల కొనలేక పోతున్నారు. ఈ కారణంగానే పనులు నిలియిపోతున్నాయి.

– ఎండీ సుభాని, ఏలూరు

పనులు ఉన్నా.. ఇసుక లేదు



మా గ్రామంలో కనీసం 400 కుటుంబాలు తాపీ, రాడ్ బెండింగ్ పనులపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రతిరోజూ పని చేసుకుంటే గాని ఇల్లు గడవని పరిస్థితి ఉంది. కానీ, ఇసుక కొరత వల్ల పనుల్లేవు. కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే నిర్మాణ రంగంలో కూలీలు సంతోషంగా ఉంటారు.

– కె.తంబి, రాడ్ బెండింగ్ మేస్త్రి

క్లుప్తంగా

అన్నసమారాధనలు



భక్తులకు భోజనం పంపిణీ చేస్తున్న జయప్రకాష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగింపును పురస్కరించుకుని శుక్రవారం వివిధ ఆలయాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. 39, 40 డివిజన్ల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్ కిలాడి జ్యోతి దుర్గారావు, మాజీ కార్పొరేటర్ మున్నుల జాన్ గురునాథ్, పేటేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

- పాండురంగాపురంలో కనకదుర్గమ్మ ఆలయం సుమారు 4 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాదేపల్లి విద్యార్థి



శశిధర్‌ను అభినందించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి బోడిగడ్డ శశిధర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడని హెచ్‌ఎం ఎస్ వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో శశిధర్ అండర్-14 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. శశిధర్ తోటి పిల్లల్లో స్ఫూర్తి నింపాడని ఎస్‌ఎంసీ చైర్మన్ కె.సత్యనారాయణతో పాటు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థితోపాటు పీడీ ఎస్‌కేవీఎస్ మణిని అభినందించారు.

లలితకు ఏఎన్‌ఆర్ అవార్డు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామాజిక సేవ, సంగీత రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా నగరానికి చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త గుడిపాటి లలితను ఏఎన్‌ఆర్ అవార్డుకు ఎంపిక చేశామని గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఆమెకు అవార్డు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా నంది అవార్డు గ్రహీత ఎస్‌వీ రామారావు, అతిథులుగా కళారత్న కేవీ సత్యనారాయణ, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు తదితరులు హాజరౌతారని వివరించారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి లక్ష్మీ సుభద్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదంతో నివారించవచ్చని ఏలూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి కె.లక్ష్మీ సుభద్ర అన్నారు. ఈ నెల 29వ తేదీన ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని స్థానిక కేపీడీటీ పాఠశాలలో నిర్వహించిన ఆయుర్వేద అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన పరిసరాల్లో లభించే ఔషధ మొక్కలతోను, వంటింట్లో లభించే శొంఠి, మిరియాలు, లవంగాలు, జీలకర్ర, మొంతులు, దనియాలు వంటి దినుసులతో తయారు చేసిన కషాయాలు, చూర్ణాలు ఉపయోగించి వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



పోలీస్ కుటుంబానికి చెక్కును అందజేస్తోన్న జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్ : పోలీస్ శాఖలో పనిచేస్తూ మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామంటూ ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ భరోసా కల్పించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కుటుంబాలతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. ఆర్థిక పరమైన అంశాలపైనా ఆరాతీశారు. పోలీస్ కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది కుటుంబం సభ్యులకు కారుణ్యనియామకాలపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భీమవరం సబ్ యూనిట్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ఈ ఏడాది పదవీ విరమణ చేసిన నాగేశ్వరరావుకు హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ.5,31,080 చెక్కును ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఓ బీవీఎస్‌ఆర్‌కే నాయక్, ఆర్‌ఐ పవన్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐ భాస్కరరావు, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌బాబు, సీసీ రాయిరామ్, పోలీస్ కుటుంబాలు ఉన్నాయి.

పేదలకు అండగా ఉండాలి



మహిళకు చీర అందిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: సమాజంలో పేదలు, ఆదరణకు నోచుకోని వారికి అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు నగరంలో గ్రేట్‌ఫుల్ గిఫ్ట్స్ సొసైటీ ప్రెసిడెంట్ సొంగా మధు ఆధ్వర్యంలో శుక్రవారం పేదలు, వృద్ధులు, మహిళలకు అన్నదానంతోపాటు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జయప్రకాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి పేదవానికీ రాబోయే కాలంలో మేలు చేసేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. సొంగా మధు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధన సమితీ రాష్ట్ర అధ్యక్షుడు మాముడూరి మహంకాళి, మాజీ కార్పొరేటర్ కిలాడి దుర్గారావు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

పేదల ఇంటి రుణాల రద్దు

- లబ్ధిదారుల గగ్గోలు
- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల వెల్లడి



జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై ఏఈ పవన్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన 1,482 మంది పేదల ఇంటి రుణాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని ఏలూరు రూరల్ హౌసింగ్ ఏఈ పి.పవన్ వెల్లడించారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ ఏఈ సభ్యులకు వివరించారు. గత ప్రభుత్వం మండలంలోని 12 జగనన్న కాలనీల్లో 2,756 మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందించిందని చెప్పారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున రుణం మంజూరు చేసిందన్నారు. ఇందులో నేటికీ ఇంటి నిర్మాణం ప్రారంభించని 1,482 మంది ఇంటి రుణం మంజూరు నిలిపేసిందని తెలిపారు. అనర్హుల గుర్తింపు చర్యలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీ స్కీమ్ రద్దు చేసి, కొత్త స్కీమ్ అమలు చేస్తుందని తెలిపారు. దీనిపై చాటపర్రు, శ్రీపర్రు సర్పంచ్‌లు గుడిపూడి రఘు, సైదు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్థలాలు రద్దు చేసిందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఎంపీడీఓ వి.శ్రీలత పరివేక్షణలో నిర్వహించిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మండల సరస్వతితో పాటు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించాలి

గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్, ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదంటూ జాలిపూడి సర్పంచ్ వీధి నవ్య, సైదు భాగ్యలక్ష్మి ఉపాధి హామీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఎంపీపీ సూచించారు.

2.50 లక్షల గోనె సంచులు సిద్ధం

మండలంలో 3,540 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు 2.50 లక్షల గోనె సంచులు సిద్ధం చేశామని తహసీల్దార్ అంతర్వేది శ్రీనివాస్ తెలిపారు. అర్హతున్న పట్టభద్రుల ఓట్లు కోసం నవంబర్ 6లోగా ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని కోరారు.

72 ఎకరాలకే నష్ట పరిహారం

ఇటీవల వచ్చిన వరదల కారణంగా నీట మునిగిన వరిచేలకు ఎకరానికి రూ.10 వేలు చొప్పున 72 ఎకరాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు.

104 మందికి కుక్కకాట్లు

కొల్లేరు గ్రామాల్లో ఇప్పటి వరకు 104 మందిని కుక్కలు కరిచాయని, నలుగురు పాముకాటుకు గురయ్యారని, ఓ వ్యక్తికి కుష్టు వ్యాధి సోకిందని గుడివాకలంక పీహెచ్‌సీ వైద్యుడు వివరించారు.

గుర్తింపుకార్డుల మంజూరు

కొల్లేరు గ్రామాల్లో 4 వేల మందికి మత్స్యకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నామని అటవీశాఖ అధికారి సోమరాజు చెప్పారు. మాధవాపురం పక్షుల విడిది కేంద్రం అభివృద్ధికి రూ.35 లక్షల అంచనాతో ప్రభుత్వానికి నివేదించామన్నారు.

● ప్రమాదంతో ఆటలు



పాఠశాల విద్యార్థులు భోజన విరామంలో ప్రమాదం అంచున ఆడుకుంటున్నారు. ఏలూరు నగరం వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్‌లో రెండస్తుల భవన నిర్మాణం అసంపూర్తి నిలిచిపోయింది. ఎటువంటి రక్షణ లేని ఆ భవనం పైకి విద్యార్థులు ఎక్కి ఆటలు ఆడుకుంటున్నారు. భవనం ఒక పైపు రోడ్డు ఉండటంతో విద్యార్థులు ప్రమాదవశాత్తు జారిపడితే పరిస్థితి ఏంటని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రక్షణ లేని భవనంలోకి విద్యార్థులు వెళ్లకుండా చూడాల్సిన ఉపాధ్యాయులు పట్టించుకుంటున్నట్టు లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	20

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36-40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	58	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	40-72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	56-64	ములక్కాడలు	07,10
బెండకాయలు	54	కంద	60
పచ్చిమిర్చి	40-46	బీట్‌రూట్	48
కాకర కాయలు	44-64	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	58	అల్లం	80
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50-60	పాలకూర	15
దొండకాయలు	32	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,55	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	40-48	బఠాణి	--
అనపకాయ (1)	30-40	క్యాప్సికమ్	84-96
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

సైబర్ నేరాల నిరోధంపై వ్యాసరచన పోటీలు



ఏలూరులో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ విద్యార్థులు పరీక్షలు రాశారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని అధికారులు తెలిపారు.

రసాభాసగా సొసైటీ సర్వసభ్య సమావేశం

భీమడోలు: గుండుగొలను సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం సభ్యులు, సహకార శాఖ పర్సన్ ఇన్‌చార్జి, సొసైటీ సిబ్బందికి మధ్య వాగ్వివాదంతో రసాభాసగా మారింది. గుండుగొలనులో శుక్రవారం ఏర్పాటుచేసిన సొసైటీ సర్వసభ్య సమావేశానికి 2800 మంది సభ్యులుండగా 60 మంది సభ్యులే హాజరవడంతో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేయాలని సభ్యులు కోరడంతో నిబంధనలు పాటిస్తున్నామని పర్సన్ ఇన్‌చార్జి అనడం వాగ్వివాదానికి దారితీసింది. పర్సన్ ఇన్‌చార్జి ఏకపక్షంగా సమావేశాన్ని నిర్వహించారని, సభ్యులతో మినిట్ పుస్తకంలో సంతకాలు చేయించుకునే తరుణంలో సిరియల్ నంబర్ వేయలేదని సభ్యులు కిర్ల రాఘవ, చింతా శామ్యూల్‌రాజు, చుండ్రు సుబ్బారావు తదితరులు విమర్శించారు. కొందరు సమావేశానికి హాజరైనప్పటికీ మినిట్ పుస్తకంలో సంతకాలు పెట్టించుకోకుండా కార్‌తో పుస్తకాన్ని తీసుకుని వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎజెండాలోని అంశాలను ఎక్కడా అమోదించలేదని పేర్కొన్నారు. కోరం లేకుండా ఏకగ్రీవ ఐంగా అమోదించిన అంశాలను నిలుపుదల చేయాల ని కోరారు. ఇప్పటికే గుండుగొలను సొసైటీలో సభ్యులు వర్గాలుగా చీలి, ఒకరిపై ఒకరు ఫిర్యా దులు చేసుకుని రెచ్చ చేసుకున్న విషయం విదితమే.

లక్ష్య సాధనకు శ్రమించాలి

గణపవరం: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, లక్ష్య సాధనకు శ్రమించాలని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సింగిల్ మేజర్ కోర్స్, గోల్స్ సెట్టింగ్‌పై జిల్లా స్థాయి వర్క్ షాపు ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చిత్తశుద్ధి, అంకితభావం ముఖ్యమని, విద్యార్థులు చెడు వ్యసనాలకు, ఈవ్‌టీజింగ్ లాంటి దురాచారాలకు దూరంగా ఉండి చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సింగిల్ మేజర్ సబ్జెక్టు నేటి తరానికి అత్యవసరమన్నారు. డిగ్రీ కోర్సుల్లో స్కిల్ కోర్సులపైనా, అనలిటికల్ స్కిల్స్‌పైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐక్యుఏసీ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020) లోని కీలక అంశాలను వివరించారు. ఏడాది డిగ్రీ కోర్సు చేస్తే సర్టిఫికెట్, రెండేళ్ల డిగ్రీ కోర్సు పూర్తిచేస్తే డిప్లమో సర్టిఫికెట్, మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తిచేస్తే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేస్తే హానర్ డిగ్రీ లేదా పీహెచ్‌డీలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. కె.స్వరూపరాణి మాట్లాడుతూ స్మార్ట్ గోల్స్ గురించి, ఇన్‌స్పైర్ వ్యక్తుల జీవిత చరిత్రలను వివరించారు. అధ్యాపకులు గణేష్‌కుమార్, శ్రీనివాసరావు, జి.వెంకటరమణ తదితరులు మాట్లాడారు. గణపవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, కామవరపుకోట తదితర డిగ్రీకాలేజీల విద్యార్థులు హాజరయ్యారు.

కోళ్ల వ్యర్థాల వ్యాన్ సీజ్

భీమడోలు : కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి భీమడోలు పరిసర ప్రాంతాల చేపల చెర్వులకు కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో యాజమాని అబ్బాస్, డ్రైవర్ మహ్మద్ ఇమ్రాన్‌లు తరలిస్తున్నారు. వీరిని సూరప్పగూడెంలోని పాతూరు గ్రామంలోకి 20 టన్నుల కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

అంతర్జాతీయ మరుగుజ్జు అవగాహన దినోత్సవం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ - టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వరల్డ్ డ్వార్ఫిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ఐబీ విశ్వనాథ్ మాట్లాడుతూ మరుగుజ్జు అనేది ఎక్కువగా జన్యుపరమైన లోపమని, ఈ వ్యాధి బాధిత వ్యక్తులు ఎత్తు తక్కువగా ఉంటారని తెలిపారు. వ్యక్తి డీఎన్ఏలో జన్యుపరమైన మార్పులు లేదా ఉత్పరివర్తనాల వల్ల మరుగుజ్జు సంభవిస్తుందన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రోత్ హార్మోన్ లోపం మరుగుజ్జు తత్వానికి ఒక సాధారణ కారణమని తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియో థెరఫీ, స్పీచ్ థెరఫీ, కృత్రిమ అవయవాలు, యూడీఐడీ మొదలగు సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దివ్యాంగులు ఈ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై 29న రైతు సదస్సు

ఉంగుటూరు: ధాన్యం కొనుగోలు సమస్యలపైనా, మద్దతు ధరపైనా ఈనెల 29న కైకరంలో జిల్లా స్థాయి రైతు సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కైకరం తూర్పువీధిలో నిర్వహించిన రైతు సంఘాల ప్రతినిధుల సమావేశంలో సదస్సు కరపత్రం విడుదల చేశారు. 29వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు కైకరం తూర్పు వీధి ఎల్‌ఐసీ భవనం వద్ద నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు ఎ.గ్రేడు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ఇస్తోందని, ఈ ధరలు పెరిగిన ఖర్చుల నేపథ్యంలో గిట్టుబాటు కాదని వివరించారు. క్వింటాలుకు 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.